కూటమి పాలనలో సంక్షోభం

- పథకాలు అమలు చేయకుండా మోసగిస్తున్నారు
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మహిళల మండిపాటు



శ్రీకాకుళం రెల్లివీధి ప్రాంతంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్నికల మేనిఫెస్టోను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భగవద్గీత, బైబిల్, ఖురాన్‌ల భావించి ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిన సీఎంగా పేరు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని రెల్లివీధి రామమందిరం నుంచి 23వ డివిజన్ ఇన్‌చార్జి జలగడుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని వివరించి క్యూఆర్ కోడ్‌ని స్కాన్‌చేయించి మోసాలను వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ గాలికొదిలేసి కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడానికి ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. నగరంలో అభివృద్ధిని గాలికొదిలేసి కేవలం కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయించి నోరునొక్కాలని చూస్తున్నారన్నారు. ఏ ఇంటికెళ్లినా తల్లికి వందనం రాలేదని... ఉచిత గ్యాస్ సిలిండర్ రాలేదని...నెలనెల రేషన్‌కి డిపోల వద్దకు వెళ్లి పడిగాపులు కాస్తున్నామని గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణారావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కామేశ్వరి, తోట తారక, బైరి మురళి, కింజరాపు రమేష్, ఎన్ని ధనుంజయ, యండ రమేష్, వానపల్లి రమేష్, గోవిందా, టౌన్ డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

తల్లికి వందనం పడలేదు



నాకు ఇద్దరు పిల్లలు. నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్నాయని తల్లికి వందనం వేయలేదు. నా పేరు మీద ఎటువంటి మీటర్లు లేవని చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో నీకు పదిహేను వేలు, నీకు పదిహేను వేలు అని చెప్పి మోసం చేయడం న్యాయమా?

– బండి కుమారి, పెద్దరెల్లివీధి, శ్రీకాకుళం

నమ్మి మోసపోయాం..



ఎన్నికలప్పుడు వచ్చి ఇంటింటికి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి కంటే అన్నీ ఎక్కువగానే ఇస్తామని చెప్పి నమ్మించి ఓటేయించుకున్నారు. గెలిచిన తరువాత ఒక్కడూ మా గడప తొక్కలేదు. చంద్రబాబు మా బతుకులు రోడ్డుపాలు చేశాడు. పథకాల కోసం ప్రశ్నిద్దామంటే ఏ టీడీపీ నాయకుడూ కనిపించడం లేదు.

– కె.పద్మ, పెద్దరెల్లివీధి, శ్రీకాకుళం

పథకం వర్తించలేదు..



ఇంట్లో ఎంతమంది చదువుకున్న వారుంటే అందరికి రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. మా ఆయన ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో రిమ్స్‌లో పనిచేస్తున్నారు. ఆ మొత్తంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఇద్దరు కవల పిల్లలున్నారు. ఇద్దరికి ఒకేసారి ఫీజులు చెల్లించడం కష్టంగా ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో అమ్మఒడి ఇచ్చారు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగమంటూ డబ్బులు వేయలేదు.

– బొమ్మాళి ఝాన్సీ, పెద్దరెల్లివీధి, శ్రీకాకుళం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు, శానిటేషన్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్‌చేశారు. ఆదివారం లావేరు మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా టి.రామానుజమ్మ, ఎం.కృష్ణవేణిలను, కమిటీ సభ్యులుగా డి.సరోజిని, డి.లక్ష్మీ, పుణ్యవతి, కుమారి, వాణమ్మలను ఎన్నుకున్నారు.

గార ఎస్ఐగా గంగరాజు



గార : మండల స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్ఐ)గా చోడిపల్లి గంగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో పనిచేస్తూ బదిలీపై గార వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్ఐ ఆర్.జనార్ధన్ వీఆర్‌లో ఉంచడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది.

పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు



పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో జాగిలాలతో తనిఖీలు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ /శ్రీకాకుళం అర్బన్: నగరంలోని మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్సు పరిసరాలు, పార్సిల్ సర్వీస్, షాపులలో ఆదివారం పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ ఒకటి, రెండో పోలీసుల ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. గంజాయి, అక్రమ మద్యం, మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు, రవాణాను అరికట్టే చర్యల్లో ఎస్సైలు రామారావు, ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో కాంప్లెక్స్, మార్కెట్‌లో తనిఖీలు చేపట్టారు.

శాకంబరిగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో లలితా సమేత శివకామేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా లలితాదేవిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. షిరిడీ సాయి సేవా సంఘం, అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా కావడి ఉత్సవం



గుడివీధిలో కావడితో ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : సుబ్రహ్మణ్య స్వామి ఆడీకృత్తిక మహోత్సవం సందర్భంగా ఆదివారం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గుడివీధిలో నాగావళి నదీ తీరంలో గంగా, యమునా, సరస్వతీ మాతృకా మందిరం వద్ద సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో కావడి ఉత్సవం నిర్వహించారు. పండితులు భాస్కరభట్ల శ్రీరామశర్మ నేతృత్వంలో అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు చేపట్టారు. అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివాకి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని 18వ వార్డు పాండ్రంగి వీధిలో కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఎం.స్వాతి, ఆర్.గాయత్రి 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఎం టీఎస్ మూర్తి, కో–ఆర్డినేటర్ జె.చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకరి కృష్ణకుమార్, చిత్రి చంటి, శ్రీకాకుళం రూరల్ యూనియన్ ప్రెసిడెంట్ గిరి, వాసు ఎల్లాజి, మాకేష్ గణేష్ పాల్గొన్నారు.

బ్రూస్‌లీ జీవితం స్ఫూర్తిదాయకం



చిన్నారులతో మార్షల్ ఆర్ట్స్ కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: బ్రూస్‌లీ ఎంతోమంది యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తారని బ్రూస్‌లీ జీత్‌కుని డో కుంగ్ ఫు కరాటే సంస్థ అధ్యక్షుడు, కోచ్ రేగిడి దయామయ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బ్రూస్‌లీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు.

వానొస్తే వణుకే!

- వెంకటాపురంలో కొన్ని వీధులకే కాలువలు
- కొద్దిపాటి వర్షమొచ్చినా జలమయమవుతున్న మిగిలిన ప్రాంతాలు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపురంలో కాలువ లేక జలమయమైన వీధి



వీధిలో కానరాని కాలువలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా పంచాయతీ వెంకటాపురంలో అడుగడుగునా కక్షపూరిత రాజకీయాలు కనిపిస్తున్నాయి. టీడీపీ నాయకుల తీరుతో వీధుల అభివృద్ధిలో కుడా పక్షపాతమే కనిపిస్తోంది. ఇక్కడ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఉన్న వీధుల్లో మంచినీరు, రోడ్లు, కాలువలు మంజూరు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని వీధులకే రోడ్లు, కాలువలు వేయించుకున్నారు తప్ప తమను పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు లేకపోవడంతో వాడుక నీరు ఇళ్ల ముందే నిలిచిపోతోందని చెబుతున్నారు. కొద్దిపాటి వర్షమొచ్చినా వీధి మొత్తం చెరువును తలపిస్తోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని చెబుతున్నారు.

కాలువలు లేవు



మా గ్రామంలో వరుసుగా పదిహేను ఇళ్లు నివాసం ఉన్న చోట కనీసం కాలువలు లేవు. దీంతో వాడుకనీరు ఇంటి ముందే నిలిచిపోతోంది. వర్షం పడితే వీధి మొత్తం చెరువును తలపిస్తోంది. వీధి శివారున గోడ అడ్డంగా ఉండటంతో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రాజమ్మ, వెంకటాపురం

పరిష్కరిస్తాం..

వెంకటాపురంలో రెండు రోజులు క్రితం పర్యటించాం. పలు సమస్యలు ఉన్నట్లు గ్రామస్తులు మా దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ సెక్రటరీతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం.

– బి.శైలజ, ఎంపీడీఓ, శ్రీకాకుళం

క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం



జి.సిగడాం: ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం అక్రమమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్కడా అవినీతి జరగకుండా ప్రభుత్వమే మద్యం షాపులు నడిపిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎటువంటి సంక్షేమ అమలు చేయకుండా సుపరిపాలన తొలి అడుగు పేరుతో గ్రామాల్లో నాయకులు పర్యటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



పెయ్యిల లక్ష్మణరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల: వైఎస్సార్ సీపీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి పెయ్యిల లక్ష్మణరావు అన్నారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా లక్ష్మణరావును ఆదివారం మురపాకలోని రామమందిరం వద్ద గ్రామపెద్దలు, వార్డు సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నెరవేరుస్తానని చెప్పారు. పార్టీకి మరింత సేవలు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బాలి శ్రీనివాస నాయుడు, విద్యాసాగర్, శిమ్మినాయుడు, ముగిది అసిరినాయుడు, బార్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మురపాకలో కంటి వైద్య శిబిరం



కళ్లను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాకలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. తేనెల మంగయ్యానాయుడు వర్ధంతి సందర్భంగా వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 74 మందికి కంటి పరీక్షలు చేయగా 22 మందిని శస్త్ర చికిత్సకు ఎంపికచేశారు. వీరిని విశాఖపట్నం కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు, తేనెల సురేష్‌కుమార్, పెయ్యిల లక్ష్మణరావు, విద్యాసాగర్, వండాన శిమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మట్లాడుతూ ప్రతి ఆదివారం విద్యార్థుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లావేరు వసతి గృహాధికారి కనకరాజు 20 మంది విద్యార్థులను ధరావతుదారులుగా చేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువే మార్గదర్శకుడు



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: గురువు శిష్యులకు మార్గదర్శకంగా వ్యవహరిస్తారని ప్రవచనకర్త నిష్టల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆచార్య దేవోభవ అనే అంశంపై ఆదివారం ప్రసంగం జరిగింది. నాలుగు యుగాలకు గాను కృతయుగంలో దక్షిణామూర్తి, త్రేతాయుగంలో దత్తాత్రేయుడు, ద్వాపరయుగంలో వ్యాసుడు, కలియుగంలో శంకరాచార్యులు గురువులుగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిక్కు అప్పన్న, పెంట కార్తికేయశర్మ, బలగ తౌడు, విశ్వేశ్వరరావు, మోహనరావు, బాబూరావు, జోగారావు, చంద్రరావు, సరస్వతి, వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములుతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

బూటకపు హామీలతో ప్రజలకు వెన్నుపోటు



రణస్థలం: తిరుపతిపాలెంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండలం తిరుపతిపాలెం, కమ్మసిగడాం గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టోను రీకాల్ చేసి ఏడాదిగా ప్రజలు మోసపోయిన పథకాల వివరాలను వీడియో రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తానని హామీ ఇచ్చిన ఆ ఊసే లేదని గుర్తు చేశారు. అమ్మ ఒడి కార్యక్రమాన్ని తల్లికి వందనంగా మార్చి అర్హులైన వేలాది మంది లబ్ధిదారులకు రూ.15వేలు జమ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, ఉపసర్పంచ్ దన్నాన సీతారాం, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ సింక గౌరి, నాయకులు మండల రవి, మండల సుదర్శిని, ఆకుల గోపి, కంది ఈశ్వరరావు, మండల రామకృష్ణ, గౌరినాయుడు, కంది సూర్యనారాయణ, పోలాకి నగేష్, దువ్వాన సతీష్, లోచర్ల కృష్ణ, రాము, పోలాకి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



జి.సిగడాం: జాడలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: ఎన్నికల ముందుకు ప్రజలకు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసగించిన కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. ఆదివారం జాడ, జగన్నాథవలస గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చిక్కాల ధర్మారావు, నాయకులు చిక్కాల నాగేశ్వరరావు, కోరాడ అచ్చెంరావు, ఇజ్జి శ్రీను, పోతుల శ్రీనివాసరావు, పోతిరెడ్డి మాధవరావు, బుంగ సాయిరాం, విక్రం మంగన్న, జరజాపు లక్ష్మణరావు, పులపా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కృషిచేయాలి



ధర్మాన ప్రసాదరావుతో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కిష్టప్పపేట గ్రామానికి చెందిన బాన నర్సింగరావును ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఆదివారం ధర్మానను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనువాసరావు, తంగి శివప్రసాద్, అల్లు లక్ష్మీనారాయణ, రుప్ప అప్పలసూరి, గుండ హరేష్, ఉంగటి గోపాలరావు, కూర్మారావు, కృష్ణప్రసాద్, బానశ్రీను, గోవింద్, గంగారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీకాకుళం మున్సిపల్ హైస్కూల్లో 1976 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఆనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. కుటుంబ సభ్యులతో సందడి చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

మాజీ క్రికెటర్ మృతికి సంతాపం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన మాజీ క్రికెటర్ భద్రగిరి శ్రీరామ్ ఆకస్మిక మృతి పట్ల జిల్లా క్రికెట్ సంఘం సంతాపం తెలియజేసింది. శ్రీరామ్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. సీనియర్ మాజీ క్రికెటర్ భద్రగిరి మురళికి ఈయన తమ్ముడు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి భద్రగిరి సోదరులు చేసిన కృషిని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ మహ్మద్ ఇలియాస్ కొనియాడారు.

నేరాలకు స్వస్తి పలకాలి

శ్రీకాకుళం క్రైమ్: చట్ట వ్యతిరేక కార్యకాలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలకి, సన్మార్గంలో నడుచుకోవాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం ఒకటి, రెండె పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎక్కడైనా నేరాలలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.